# ఇంటర్ హాల్ టికెట్లపై క్యూఆర్‌కోడ్

- దారితప్పడం, అడ్రస్ తెలియకపోవడం ఉండదిక
- కొత్తగా సీఎస్‌డీవోల మొబైల్ నెంబర్
- విద్యార్థుల మొబైల్స్‌కే హాల్ టికెట్ల లింక్
- ఇంటర్ బోర్డు చరిత్రలో ఇదే తొలిసారి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : మీరు ఇంటర్ వార్షిక పరీక్షలు రాయబోతున్నారా? ఒక వేళ మీ పరీక్షాకేంద్రం సెంటర్ తెలియకపోతే డోంట్ వర్రీ. హాల్‌టికెట్లపై పరీక్షాకేంద్రం లొకేషన్ క్యూ ఆర్‌కోడ్ రూపంలో ఉంటుంది. ఈ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్‌చేయగానే మీ పరీక్షాకేంద్రం అడ్రస్ తెలిసిపోతుంది. మీరు ఉండే ప్రాంతం నుంచి సెంటర్ ఎంత దూరమో.. ట్రాఫిక్ ఎలా ఉందో.. ఎన్ని నిమిషాల్లో చేరుకోగలరో కూడా చెబుతుంది. ఇలాంటి ప్రత్యేకతలతో హాల్‌టికెట్లను ఇంటర్‌బోర్డు సిద్ధం చేస్తున్నది. ఇలా క్యూఆర్‌కోడ్‌తో హాల్‌టికెట్లు జారీచేయడం ఇదే తొలిసారి. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభంకానున్నాయి. వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు సులభంగా పరీక్షాకేంద్రాలకు చేరుకునేందుకు ఇంటర్‌బోర్డు ఇలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య తెలిపారు.

**మరికొన్ని ఏర్పాట్లు..**

- ఇది వరకు పరీక్షాకేంద్రం పూర్తి అడ్రస్‌ను హాల్‌టికెట్లపై ముద్రించేవారు కాదు. అడ్రస్ కాలమ్‌లో 13 పదాలు మాత్రమే ఉండేవి. కానిప్పుడు పరీక్షాకేంద్రం ఇంటి నెంబర్, కాలనీ, ఏ ప్రాంతంలో ఉందో తదితర పూర్తి వివరాలను హాల్‌టికెట్లపై ముద్రిస్తారు.
- హాల్‌టికెట్‌పై పరీక్షా కేంద్రం అడ్రస్‌ను క్యూఆర్‌కోడ్ రూపంలో ముద్రిస్తున్నారు. కోడ్‌ను స్కాన్‌చేస్తే లొకేషన్ చూపిస్తుంది.
- పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో) మొబైల్ నెంబర్లను సైతం హాల్‌టికెట్లపై ముద్రిస్తారు. వారికి ఫోన్‌చేసి సైతం అడ్రస్ కనుక్కోవచ్చు.
- హాల్‌టికెట్‌పై ఐవీఆర్ నెంబర్‌ను సైతం తొలిసారిగా ముద్రిస్తున్నారు. హాల్‌టికెట్ డౌన్‌లోడింగ్ సహా ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుంది.
- సెంటర్ లొకేటర్ యాప్ సైతం అందుబాటులో ఉంటుంది. ఈ యాప్‌లో హాల్‌టికెట్ నెంబర్ ఎంటర్‌చేస్తే లొకేషన్‌ను చూపిస్తుంది. ఎంత సమయంలో చేరుకోవచ్చో. పరీక్షాకేంద్రానికి వెళ్లేందుకు గల మార్గాలను చూపిస్తుంది.
- హాల్‌టికెట్ లింకును విద్యార్థి మొబైల్ ఫోన్, తల్లిదండ్రుల ఫోన్లకు పంపిస్తారు. విద్యార్థి సొంతంగా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకుని పరీక్షలకు హాజరుకావొచ్చు. ప్రిన్సిపాల్ సంతకం లేకపోయినా పరీక్షలకు అనుమతిస్తారు.

# లంచం ఇవ్వలేను.. చచ్చిపోతా!

- ఆర్టీవో అధికారుల వేధింపులతో లారీ ఓనర్ ఆత్మహత్యాయత్నం
- విద్యుత్ తీగలను తాకేయత్నం
- ట్యాక్స్ కట్టమన్నందుకే: ఆర్టీవో



పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయం ఆవరణలో లారీ ఎక్కి విద్యుత్ వైర్లు తాకుతానని అందోళన చేస్తున్న బసంత్‌నగర్‌కు చెందిన లారీ ఓనర్ అనిల్ కుమార్‌గౌడ్

పెద్దపల్లి, ఫిబ్రవరి 15 : ఆర్టీవో అధికారుల నుంచి లంచాల వేధింపులు తాళలేక శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయం ఆవరణలో బసంత్‌నగర్‌కు చెందిన లారీ ఓనర్ అనిల్ కుమార్‌గౌడ్ లారీ ఎక్కి విద్యుత్ తీగలను తాకి అత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. మామూళ్లు ఇవ్వనందుకు తన లారీపై పదేపదే కేసులు పేడుతున్నారని, ఒక్కో లారీకి నెలకు రూ.8 వేల చొప్పున లంచం వసూలు చేస్తున్నట్టు ఆరోపించారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించనని చావనైనా చస్తాకానీ లంచం ఇవ్వనని స్పష్టంచేశాడు. ఆర్టీవో అధికారులు పోలీసులు, విద్యుత్తు అధికారులకు సమాచారం ఇవ్వగా వారు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. పెద్దపల్లి పోలీసులు, ఆర్టీవో రంగారావు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు.

## సకాలంలో ట్యాక్స్ కట్టలేదు



అనిల్‌కుమార్‌గౌడ్ తన లారీకి సంబంధించిన ట్యాక్స్ కట్టలేదని 7 నెలల క్రితం లారీని సీజ్ చేసి జరిమానా విధించారు. అప్పటి నుంచి ఆర్టీవో కార్యాలయంలో లారీ ఉంది. ఇటీవల అనిల్ కుమార్‌గౌడ్‌ను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినం. ట్యాక్స్ కట్టాలని చెప్పగా ఒప్పుకున్న అనిల్‌కుమార్ శనివారం లారీ ఎక్కి విద్యుత్ తీగలను తాకే ప్రయత్నం చేశాడు. నచ్చజెప్పి కిందికి దింపించాం. మళ్లీ కౌన్సెలింగ్ ఇవ్వగా ట్యాక్స్, జరినామా చెల్లించాడు.

**- రంగారావు, పెద్దపల్లి ఆర్టీవో**



ఓవరాల్ టీం చాంపియన్ షిప్ ట్రోఫీని అందుకుంటున్న తెలంగాణ పోలీసులు

# పోలీస్ డ్యూటీ మీట్‌లో మనోళ్లే టాప్

- అన్ని విభాగాల్లో 18 పతకాలు సాధించిన తెలంగాణ పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీసులు 68వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో అన్ని విభాగాల్లోనూ అద్భుత ప్రతిభకనబర్చి 18 పతకాలతో మొదటిస్థానంలో నిలిచారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ పట్టణంలో ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ మీట్‌లో తెలంగాణ పోలీసులు అత్యున్నత నైపుణ్యం, క్రమశిక్షణతోపాటు మొత్తం 18 పతకాలు గెలుచుకొని రాష్ట్ర ఖ్యాతిని పెంచారు. ఈ పురస్కార ప్రదానోత్సవంలో జార్ఖండ్ ఆర్థికశాఖ మంత్రి రాధాకృష్ణ కిషోర్, మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఐజీ సీఐడీ (ఆర్గనైజింగ్ సెక్రటరీ) ఇతర జాతీయ స్థాయి పోలీస్ అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ బృందం తరపున సీఐడీ ఎస్పీబీ రాంరెడ్డి 'ఓవరాల్ టీం చాంపియన్ షిప్ ట్రోఫీ'ని స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, సీఐడీ డీజీ శిఖా గోయెల్ ఈ గెలుపుపై సంతోషం వ్యక్తం చేస్తూ.. 'ఈ విజయానికి కారకులైన పోలీస్ సిబ్బంది, శిక్షకులు, సహాయక సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు' అని పేర్కొన్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.